సాక్షి
ఆదిలాబాద్

శుక్రవారం । 20 । జనవరి । 2023

డిగ్రీలో 19 మంది డిబార్

ఆదిలాబాద్‌టౌన్‌: కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఉమ్మడి జిల్లాలో డిగ్రీ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం జరిగిన పరీక్షలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 19 మంది డిబార్‌ అయినట్లు కేయూ పరీక్షల విభాగం అడిషనల్‌ కంట్రోలర్‌ నరేందర్‌ తెలిపారు. ఇచ్చోడలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో ఆరుగురు, సాయి సమత్‌ డిగ్రీ కళాశాలలో ముగ్గురు, జన్నారంలోని అజ్మీర రేఖాశ్యామ్‌ డిగ్రీ కళాశాలలో 10 మంది విద్యార్థులు మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతూ డిబార్‌ అయినట్లు పేర్కొన్నారు.



కొనసాగుతున్న మెస్రం వంశీయుల పూజలు

10లో▸

గంగాజలంతో వచ్చిన మెస్రం వంశీయులు కేస్లాపూర్‌ సమీపంలోని మర్రిచెట్టు వద్ద బస చేశారు. కితల వారీగా వంటలు చేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.4/19.4

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. గాలిలో తేమ తగ్గుతుంది. మధ్యాహ్నం ఎండగా అనిపిస్తుంది. చలి ప్రభావం బాగా తగ్గుతుంది.

న్యూస్‌రీల్‌

మంత్రి ఐకేరెడ్డిని కలిసిన మెస్రం వంశీయులు



ఐకేరెడ్డికి ఆహ్వానపత్రం అందజేస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని గురువారం మెస్రం వంశీయులు నిర్మల్‌లోని మంత్రి కార్యాలయానికి వెళ్లి కలిశారు. నాగోబా మహాపూజకు రావాలని ఆహ్వానపత్రిక అందించారు. ఈ నెల 21న రాత్రి 10–30 గంటలకు నాగోబా మహాపూజ నిర్వహించి జాతరను ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. నాగోబా మహాపూజ, దర్బార్‌కు రావాలని కోరినట్లు వారు తెలిపారు. మెస్రం వంశీయులు మెస్రం మనోహర్‌, మెస్రం ఆనంద్‌రావ్‌ తదితరులున్నారు.

నేడు జిల్లాస్థాయి టీఎల్‌ఎం మేళా

అలలాబాద్‌టౌన్‌: జిల్లాస్థాయి బోధన అభ్యసన సామగ్రి (టీఎల్‌ఎం) మేళాను శుక్రవారం ఆదిలాబాద్‌ పట్టణంలోని గెజిటెడ్‌–1 ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించనున్నట్లు డీఈవో ప్రణీత ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఆదిలాబాద్‌ ఎమ్మెల్యే జోగు రామన్న, కలెక్టర్‌ సిక్తా పట్నాయక్‌, జెడ్పీ చైర్మన్‌ రాథోడ్‌ జనార్దన్‌ తదితరులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న విజయలక్ష్మి

ఆదిలాబాద్‌టౌన్‌: ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధికల్పన ఇన్‌చార్జి అధికారి విజయలక్ష్మి కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా ఉపాధికల్పన శాఖ కార్యాలయంలో శుభగృహ ప్రైవేట్‌ కంపెనీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. 17మంది అభ్యర్థులు మాత్రమే హాజరు కాగా, నలుగురు ఎంపికైనట్లు తెలిపారు. హైదరాబాద్‌లో ఉద్యోగాలు చేయాల్సి ఉండడంతో అభ్యర్థులు ఎక్కువ మంది జాబ్‌మేళాకు హాజరుకానట్లు తెలుస్తోంది. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.12వేల నుంచి రూ.18వేలు చెల్లించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేళాలో ఉపాధికల్పన శాఖ ఉద్యోగులు గోవర్ధన్‌, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్‌

ఇచ్చోడ: ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులకు ఆంగ్లమాధ్యమంలో బోధించేందుకు ఐదు రోజుల పాటు ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్‌ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని గిరిజన యూత్‌ ట్రైనింగ్‌ సెంటర్‌లో ఆదిలాబాద్‌, నిర్మల్‌ జిల్లాలకు చెందిన భౌతిక, జీవశాస్త్రం ఉపాధ్యాయులకు ఆంగ్లమాధ్యంలో బోధించేందుకు ఇస్తున్న ఐదురోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు ఆంగ్ల విద్యను బోధించేందుకు ఐటీడీఏ ప్రత్యేక కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏసీఎంవో జగన్‌, జిల్లా క్రీడాధికారి పార్థసారధి, శిక్షణ క్యాంప్‌ ఆఫీసర్‌ గోడం చందన్‌, జీసీడీవో మెస్రం ఛాయ తదితరులున్నారు.

అటవీశాఖ అధికారికి షోకాజ్‌ నోటీస్‌!

నేరడిగొండ: అటవీ ప్రాంతం నుంచి కలప అక్రమ తరలింపుపై గురువారం 'సాక్షి' దినపత్రికలో 'అటవీ అధికారుల కనుసన్నల్లోనే కలప తరలింపు' శీర్షికన ప్రచురించిన కథనానికి అటవీశాఖ ఉన్నతాధికారులు స్పందించారు. ఆరెపల్లి సెక్షన్‌ ఆఫీసర్‌ లఖన్‌సింగ్‌కు షోకాజు నోటీస్‌ ఇచ్చినట్లు సమాచారం.



కడెం ఎగువన కుప్టి నిర్మించే ప్రతిపాదిత ప్రాంతం

కుప్టికి మోక్షమెప్పుడో!

- గత అంచనా రూ.900 కోట్లు
- తాజాగా రూ.1,100కోట్లకు పెంపు
- గతేడాది బడ్జెట్‌లో మొండిచేయి
- ఈసారైనా నిధులు కేటాయించేనా?
- పూర్తయితే ప్రయోజనాలు మెండు

కుప్టి స్వరూపం ఇలా..

నీటి నిల్వ సామర్థ్యం	5.30 టీఎంసీలు
నీటిమట్టం	394.00 మీటర్లు
జలమార్గం	7 రేడియల్‌ గేట్లు
అంచనా వ్యయం	రూ.1100 కోట్లు
ముంపు గ్రామాలు	కుమారి, గాజిలి గ్రామాలు పూర్తిగా, గాంధారి గ్రామం పాక్షికంగా..

సాక్షి, ఆదిలాబాద్‌: కుప్టి ప్రాజెక్ట్‌ నిర్మాణ అంచనా వ్యయం పెరిగింది. గతంలో రూ.900 కోట్లు ఉండగా.. 2023లో సవరించిన స్టాండర్డ్‌ షెడ్యూల్‌ ఆఫ్‌ రేట్స్‌ (ఎస్‌ఎస్‌ఆర్‌) ప్రకారం తాజాగా రూ.1,100 కోట్లకు పెంచారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో దీనికి మోక్షం లభిస్తుందా.. లేదా? అనేది తేలాల్సి ఉంది. 2015 జూన్‌లో నేరడిగొండ సమీపంలోని కుప్టి గ్రామం వద్ద బహుళార్థసాధక ప్రాజెక్ట్‌ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నివేదిక కోరింది. అప్పట్లోనే డిటేల్‌ ప్రాజెక్ట్‌ రిపోర్ట్‌ (డీపీఆర్‌) తయారీకి రూ.1.47 కోట్లకు పరిపాలన ఆమోదం కూడా ఇచ్చింది. అప్పట్లో ఈ పనిని శ్రీరామచంద్ర సర్వే కన్సల్టెంట్‌కు అప్పగించారు. ఏజెన్సీ సర్వే పనులు పూర్తి చేసి 2016 ఏప్రిల్‌లో డీపీఆర్‌ సమర్పించింది. దీనికి ప్రభుత్వం పరిపాలన ఆమోదం తెలిపింది.

బ్యాలెన్సింగ్‌ రిజర్వాయర్‌గా..

కడెం ప్రాజెక్ట్‌కు నిల్వ బ్యాలెన్సింగ్‌ రిజర్వాయర్‌గా ఉపయోగించడం కోసం దీన్ని నిర్మించాలని ప్రభుత్వం అప్పట్లోనే స్పష్టం చేసింది. 2020–21లో దీనికి సంబంధించి ఎస్‌ఎస్‌ఆర్‌ రేట్స్‌ ప్రకారం మరో డీపీఆర్‌ కూడా తయారు చేశారు. తాజాగా సవరించిన అంచనాల ప్రకారం ఈ డీపీఆర్‌ను రూపొందించి ప్రభుత్వానికి సమర్పించారు. గత బడ్జెట్‌లోనూ దీని ప్రస్తావన వస్తుందని ఆశించినప్పటికీ ముందుకుసాగలేదు. ఈసారి ఏమవుతుందో చూడాల్సిందే.

ఇదీ.. పరిస్థితి

బచావత్‌ అవార్డు ప్రకారం కడెం ప్రాజెక్ట్‌ ఆయకట్టు 68,150 ఎకరాలకు 13.42 టీఎంసీల నీటిని వినియోగించుకోవాలి. అయితే ఈ ప్రాజెక్ట్‌ జూలై నుంచి సెప్టెంబర్‌లో మాత్రమే నీటిని స్వీకరిస్తుంది. అదీ 7.20 టీఎంసీలు మాత్రమే. ఆయకట్టుకు నీటి డిమాండ్‌ ప్రధానంగా అక్టోబర్‌ నుంచి డిసెంబర్‌ వరకు ఉంటుంది. ప్రతీ పంట కాలం ముగిసేసరికి నీటి కొరత ఏర్పడుతుంది. ఇది రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య. 42,883 ఎకరాల ఆయకట్టుకు మాత్రమే కడెం ప్రాజెక్ట్‌ నుంచి సాగునీరు అందుతుంది. మిగతా 25,267 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించేందుకు ఈ ప్రాజెక్ట్‌ ఎగువన గోదావరి పరీవాహక ప్రాంతమైన కుప్టి వద్ద బ్యాలెన్సింగ్‌ రిజర్వాయర్‌ను ప్రభుత్వం ప్రతిపాదించింది. కడెం ఆయకట్టుకు అనుబంధంగా ఈ రిజర్వాయర్‌ ఉంటుంది.

ఇక్కడే ఎందుకంటే?

కడెం ప్రాజెక్ట్‌ను 1958లో నిర్మించారు. 7.20 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మించిన ఈ ప్రాజెక్ట్‌కు 18 గేట్లు ఉన్నాయి. ఆదిలాబాద్‌ జిల్లాలోని నేరడిగొండ, ఇచ్చోడ మండలాల మధ్యలో ఉన్న కుప్టి గ్రామం నుంచి నీటి పరీవాహకం ఉంది. ఈ నీరే కడెం ప్రాజెక్ట్‌కు చేరుతుంది. బచావత్‌ అవార్డు ప్రకారం 13.42 టీఎంసీల నీటిని వినియోగించుకునేందుకు అవకాశం ఉన్నప్పటికీ, కడెం వద్ద అటవీ సంపదను దృష్టిలో పెట్టుకొని ప్రాజెక్ట్‌ సామర్థ్యాన్ని పెంచే అవకాశాలు లేవు. దీంతో ప్రభుత్వం ఎగువ ప్రాంతంలో ఉన్న కుప్టి వద్ద రిజర్వాయర్‌ నిర్మాణానికి బీజం వేసింది. దాంట్లో భాగంగానే కుప్టి బహుళార్థసాధక ప్రాజెక్ట్‌ నిర్మించాలని ప్రతిపాదించించారు. ఆయకట్టు స్థిరీకరణ, విద్యుత్‌ ఉత్పత్తి, తాగునీటి సదుపాయం అందించడం లాంటి ప్రయోజనాలతో దీన్ని చేపడుతున్నారు.

ప్రధాన ప్రయోజనాలు..

- కడెం ప్రాజెక్ట్‌ కింద పూర్తిస్థాయి ఆయకట్టు స్థిరీకరణ.
- మూడు మెగావాట్ల జల విద్యుత్‌ ఉత్పత్తి.
- బోథ్‌ నియోజకవర్గంలోని బోథ్‌, బజార్‌హత్నూర్‌, ఇచ్చోడ, నేరడిగొండ మండలాలు, ఖానాపూర్‌ నియోజకవర్గంలోని కడెం మండలానికి ఏడాది పొడవునా తాగు నీటిసౌకర్యం.
- భవిష్యత్‌లో బోథ్‌ నియోజకవర్గంలో లిఫ్ట్‌ ఇరిగేషన్‌ పథకాల ద్వారా కొత్త నీటి పారుదల సామర్థ్యాన్ని సృష్టించే అవకాశం.
- నీటి ప్రవాహం కొనసాగడంతో కుంటాల జలపాతం సహజ సౌందర్యం చాలాకాలం పాటు ఉంటుంది. తద్వారా ప్రభుత్వానికి పర్యాటకుల ద్వారా ఆదాయం లభిస్తుంది.
- కడెం నదికి ఇరువైపులా ప్రాజెక్ట్‌ ఎగువ, దిగువ ఉన్న పరిసర గ్రామాల్లో భూగర్భ జలమట్టం రీచార్జ్‌ అవుతుంది.
- కడెం ఆయకట్టు నుంచి గోదావరి నదిలో పునరుత్పత్తి నీటి కారణంగా గూడెం, ధర్మపురి వద్ద గోదావరినదికి నీరు చేరడం ద్వారా సమీపంలో ఉన్న దేవాలయాలకు ఎక్కువ మంది యాత్రికులు ఆకర్షితులయ్యే అవకాశం ఉంటుంది.

గతంలోలాగే డీపీఆర్‌

కుప్టి ప్రాజెక్ట్‌ నిర్మాణం అంచనా వ్యయాన్ని తాజా ఎస్‌ఎస్‌ఆర్‌ రేట్స్‌ ప్రకారం సవరించి ప్రభుత్వానికి నివేదించడం జరిగింది. డీపీఆర్‌ గతంలో రూపొందించిన మాదిరిగానే ఉంటుంది.

– విఠల్‌, ఈఈ, ఇరిగేషన్‌ డివిజన్‌–2 (కుప్టి ప్రాజెక్ట్‌), ఆదిలాబాద్‌

4,562 మందికి స్క్రీనింగ్‌

ఆదిలాబాద్‌టౌన్‌: రెండో విడత కంటివెలుగులో భాగంగా జిల్లాలోని 33 కేంద్రాల్లో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాల్లో గురువారం స్క్రీనింగ్‌ నిర్వహించారు. మొదటిరోజు 4,562 మందికి పరీక్షలు నిర్వహించి 814 మందికి రీడింగ్‌ గ్లాసులు పంపిణీ చేశారు. 808 మందికి దూరపు చూపు అద్దాలు అవసరం ఉండగా ఆర్డర్‌ ఇచ్చినట్లు డీఎంహెచ్‌వో నరేందర్‌ రాథోడ్‌ తెలిపారు. వారం రోజుల్లో వారి ఇంటికే సిబ్బంది వచ్చి పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

సీఎస్‌ను కలిసిన జెడ్పీ చైర్మన్‌



సీఎస్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న జనార్దన్‌

కైలాస్‌నగర్‌: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శాంతికుమారిని జెడ్పీ చైర్మన్‌ జనార్దన్‌ రాథోడ్‌ గురువారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో ఆదిలాబాద్‌ కలెక్టర్‌గా శాంతికుమారి అందించిన సేవలను గుర్తు చేశారు. ఆయన వెంట గాదిగూడ వైస్‌ ఎంపీపీ యోగేశ్‌, మర్సుకోల తిరుపతి ఉన్నారు.

ఆక్టోపస్‌ బలగాల మాక్‌డ్రిల్‌



మాక్‌డ్రిల్‌ నిర్వహిస్తున్న ఆక్టోపస్‌ బలగాలు

తాంసి: మండలంలోని వడ్డాడి వద్ద గల మత్తడివాగు ప్రాజెక్ట్‌ వద్ద గురువారం ఆక్టోపస్‌ బలగాలు మాక్‌డ్రిల్‌ నిర్వహించాయి. టెర్రరిస్టులు, దేశద్రోహులు ప్రాజెక్టులు, అక్కడి అధికారులు, స్థానిక ప్రజలను స్వాధీనపర్చుకుంటే.. ఎలా నిరోధించాలనే విషయమై మాక్‌డ్రిల్‌ చేపట్టారు. ఆక్టోపస్‌ డీఎస్పీ ఎం.విజయ్‌కుమార్‌, ఆదిలాబాద్‌ డీఎస్పీ ఉమేందర్‌, రూరల్‌ సీఐ రఘుపతి, రిజర్వ్‌ ఇన్‌స్పెక్టర్‌ వంశీకృష్ణ, తలమడుగు ఎస్సై ప్రవళిక తదితరులున్నారు.

అధికార పార్టీ అండతోనే కబ్జాలు

- ఎంపీ సోయం బాపూరావు
- సీసీఐ భూముల పరిశీలన



ఆర్కే గుప్తాతో మాట్లాడుతున్న ఎంపీ బాపూరావు

ఆదిలాబాద్‌: అధికార పార్టీ అండతోనే పలువురు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భూములను స్వాహా చేస్తున్నారని ఎంపీ సోయం బాపూరావు ఆరోపించారు. 'సీసీఐ భూములు స్వాహా' శీర్షికన 'సాక్షి' దినపత్రికలో గురువారం ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆయన సీసీఐ భూములను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఆదిలాబాద్‌ పార్లమెంట్‌ పరిధిలోని ప్రభుత్వ భూములను అధికార పార్టీ నాయకులు కబ్జా చేయడమే కాకుండా వాటిని లేఅవుట్లుగా మార్చి అమాయక ప్రజలకు అంటగడుతున్నారని మండిపడ్డారు. జిల్లాలో ఎక్కడెక్కడ ఎన్ని ప్రభుత్వ భూములున్నాయి.. ఎన్ని ఎకరాలు కబ్జాకు గురయ్యాయనే వివరాలు సేకరించి గవర్నర్‌, సీఎం, సీఎస్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. 2025 వరకు సీసీఐ లీజులో ఉన్న భూములను నిబంధనలకు విరుద్ధంగా కబ్జా చేశారని ఆరోపించారు. గతంలో ఉపాధి అవకాశాలు లభిస్తాయని భావించిన రైతులు ప్రస్తుతం ఉపాధి, భూములు కోల్పోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. కబ్జాలకు పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. లేకుంటే రైతులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అంతకుముందు సీసీఐ ఎగ్జిక్యూటివ్‌ ఇన్‌చార్జి ఆర్కే గుప్తాను విచారించగా సరైన సమాధానం ఇవ్వకుండా దాటేశారని తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్‌ శంకర్‌, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినీరెడ్డి, మహేందర్‌, ముకుంద్‌, భార్గవ్‌ తదితరులున్నారు.

సీసీఐ ఆస్తులను పరిరక్షించాలి

ఎదులాపురం: సీసీఐ ఆస్తులను పరిరక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్‌ డిమాండ్‌ చేశారు. సీసీఐకి సంబంధించిన ఆస్తులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. సీసీఐ ఆస్తులను కొందరు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో ప్రజలు, రైతులను ఏకం చేసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. నాయకులు బండి దత్తాత్రి, అన్నమొల్ల కిరణ్‌, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే జోగు రామన్న
- కలెక్టర్‌ సిక్తాపట్నాయక్‌తో కలిసి కంటివెలుగు కార్యక్రమం ప్రారంభం



ఆదిలాబాద్‌ టౌన్‌: కార్యక్రమాన్ని ప్రారంభించి పరిశీలిస్తున్న కలెక్టర్‌, ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌టౌన్‌: అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జోగు రామన్న పేర్కొన్నారు. రెండో విడత కంటివెలుగు కార్యక్రమాన్ని కలెక్టర్‌ సిక్తా పట్నాయక్‌తో కలిసి గురువారం జిల్లా కేంద్రంలోని యువజన శిక్షణ కేంద్రం (వైటీసీ)లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కంటివెలుగును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలో కంటివెలుగు నిర్వహణకు 33 బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. 27 గ్రామీణ ప్రాంతాలు, ఆరు పట్టణ ప్రాంతాల్లోని కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు శిబిరాలకు ప్రజలు హాజరయ్యేలా చూడాలని సూచించారు. అంతకుముందు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి నరేందర్‌ రాథోడ్‌ కంటివెలుగు కార్యక్రమంపై వివరించారు. అనంతరం క్యాంపును ప్రారంభించి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్‌ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్‌ చైర్మన్‌ జోగు ప్రేమేందర్‌, ట్రైనీ సహాయ కలెక్టర్‌ శ్రీజ, జాయింట్‌ డైరెక్టర్‌ జాన్‌బాబు, మున్సిపల్‌ కమిషనర్‌ శైలజ, కౌన్సిలర్‌ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

తలమడుగు: కంటివెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్‌ సిక్తా పట్నాయక్‌ కోరారు. మండలంలోని ఖోడద్‌, ఉండమ్‌ గ్రామాల్లో కంటివెలుగు శిబిరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ.. శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ పరీక్షలు నిర్వహించాలని, అవసరమైన వారికి కళ్లద్దాలు పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీవో కిషన్‌, తహసీల్దార్‌ ఇమ్రాన్‌ ఖాన్‌, ఎంపీడీవో రమాకాంత్‌, జెడ్పీటీసీ గణేశ్‌రెడ్డి, సర్పంచులు, ఆనంద్‌, పోచ్చుబాయి, కిరణ్‌కుమార్‌, రఫీక్‌, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్‌: కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్‌ కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే సూచించారు. పట్టణంలోని గాంధీనగర్‌, పాత తర్లపాడ్‌, మస్కాపూర్‌ గ్రామాల్లో కంటివెలుగు శిబిరాలను పరిశీలించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు రాజేందర్‌, మోహిద్‌, కలీల్‌, పడిగెల సునంద, అడిదెల మహేందర్‌, పుప్పాల స్వప్న, రాజమోహ న్‌, బాలే మల్లేశ్‌, కావలి సంతోష్‌, తొంటి శ్రీని వాస్‌, రాజగంగన్న, రత్నాకర్‌రావు, చిన్న బాపు ఉన్నారు.

ఇచ్చోడ: మండలంలోని కోకస్‌మాన్నూర్‌, సాథ్‌నంబర్‌ గ్రామాల్లోని కంటివెలుగు శిబిరాలను అదనపు కలెక్టర్‌ రిజ్వాన్‌భాషా పరిశీలించారు. ప్రతీ శిబిరంలో రోజుకు 300 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైవారికి కళ్లద్దాలు అందించాలని సూచించారు. ఎంపీపీ నిమ్మల ప్రీతమ్‌రెడ్డి, ఎంపీడీవో రాంప్రసాద్‌, సర్పంచ్‌ గంగారాం, వైద్యాధికారి సాగర్‌, పంచాయతీ కార్యదర్శి రమేశ్‌, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుడిహత్నూర్‌: స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు కేంద్రాన్ని అదనపు కలెక్టర్‌ రిజ్వాన్‌ భాషా షేక్‌ ప్రారంభించారు. ఎంపీడీవో సునీత, సర్పంచ్‌ జాదవ్‌ సునీత, ఎంపీటీసీ అంకతి సవిత, ఎంపీవో లింగయ్య, ఉప సర్పంచ్‌ గజానంద్‌, వైద్యాధికారి శ్యాంసుందర్‌, ఆర్బీఎస్‌ అధ్యక్షుడు బూర్ల లక్ష్మీనారాయణ, నాయకులు రమేశ్‌జాదవ్‌, రావణ్‌ ముండే తదితరులున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి

- ఎస్పీ డీ ఉదయ్‌కుమార్‌రెడ్డి
- ఆర్‌ఏఎఫ్‌ బలగాల ఫ్లాగ్‌మార్చ్‌

ఆదిలాబాద్‌టౌన్‌: జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఎస్పీ డీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్‌ వద్ద ర్యాపిడ్‌ యాక్షన్‌ ఫోర్స్‌ (ఆర్‌ఏఎఫ్‌) బలగాల ఫ్లాగ్‌మార్చ్‌ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆర్‌ఏఎఫ్‌ బలగాలు ఆదిలాబాద్‌ పట్టణంలోని ప్రధాన వీధులతో పాటు పట్టణంలోని సమస్యాత్మక కాలనీల్లో కవాతు నిర్వహించాయి. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. ర్యాపిడ్‌ యాక్షన్‌ ఫోర్స్‌ బలగాల కవాతు ఈనెల 24 వరకు జిల్లాలోని ఆదిలాబాద్‌ పట్టణం, ఉట్నూర్‌, బోథ్‌, నేరడిగొండ, జైనథ్‌, ఇచ్చోడలో కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా, ప్రశాంత వాతావరణం కల్పించేందుకు ముందస్తుగా ర్యాలీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆర్‌ఏఎఫ్‌ శిక్షణలో భాగంగా ఈ ర్యాలీ వారంపాటు జిల్లాలోని పలు మండలాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌ 91వ ర్యాపిడ్‌ యాక్షన్‌ బెటాలియన్‌కు చెందిన 80 మంది బలగాలతో పాటు అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, పట్టణ డీఎస్పీ ఉమేందర్‌, ఆర్‌ఏఎఫ్‌ డీఎస్పీ శశాంక్‌తో కలిసి ఎస్పీ ర్యాలీని వన్‌టౌన్‌ నుంచి ప్రారంభించారు. వినాయక చౌక్‌, మసూద్‌ చౌక్‌, ఖానాపూర్‌, బొక్కలగుడ మసీద్‌, హనుమాన్‌ మందిరం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్‌ కళాశాల మీదుగా ర్యాలీ కొనసాగి తిరిగి వన్‌టౌన్‌ వద్దకు చేరింది. ఖానాపూర్‌ బొక్కలగుడ కాలనీలో ర్యాలీగా వస్తున్న కేంద్ర బలగాలకు స్థానికులు పూలు చల్లి స్వాగతం పలికారు. ఆదిలాబాద్‌ ప్రభుత్వ ఉన్నత పాఠశాల బొక్కలగుడ, జూనియర్‌ కళాశాలలో విద్యార్థులకు ర్యాపిడ్‌ యాక్షన్‌ ఫోర్స్‌ సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో వన్‌టౌన్‌ సీఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ, ఏఎస్పీ, డీఎస్పీ

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి



క్రీడాకారులతో గోవర్ధన్‌రెడ్డి

ఆదిలాబాద్‌: హాకీ క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలని ఒలింపిక్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో రాష్ట్రస్థాయికి ఎంపికైన హాకీ జూనియర్‌ క్రీడాకారుల అభినందన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిక్షణను సద్వినియోగం చేసుకుంటూ రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలన్నారు. ఈనెల 21 నుంచి 23 వరకు శంషాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి సబ్‌ జూనియర్స్‌ హాకీకి ఎంపికైన జిల్లా జట్టును అభినందించారు. అంతకుముందు సీనియర్‌ హాకీ కోచ్‌ మల్లేశ్వర్‌ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఒలింపిక్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి పార్థసారథి, కోచ్‌లు శేఖర్‌, అతుల్‌ పాల్గొన్నారు.

'గణతంత్ర' వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్‌ సిక్తాపట్నాయక్‌



జూమ్‌ కాన్ఫరెన్స్‌ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్‌

కైలాస్‌నగర్‌: ఈనెల 26న నిర్వహించనున్న గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్‌ సిక్తా పట్నాయక్‌ సూచించారు. గురువారం తన క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా అధికారులతో జూమ్‌ కాన్ఫరెన్స్‌ ద్వారా గణతంత్ర వేడుకల నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ.. వేడుకల నిర్వహణకు ఆయా శాఖల అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయాలని, ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలో వివిధ శాఖల ద్వారా చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల సంక్షిప్త సందేశాన్ని తయారుచేయాలని డీపీఆర్వోను ఆదేశించారు. పోలీస్‌ పరేడ్‌గ్రౌండ్‌ చదును చేసి పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని మున్సిపల్‌ కమిషనర్‌కు సూచించారు. బందోబస్తు, గాడ్‌ ఆఫ్‌ హానర్‌కు సంబంధించి పోలీస్‌ అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. షామియానా, సీటింగ్‌ అరెంజ్‌మెంట్‌ తదితర ఏర్పాట్లను పట్టణ తహసీల్దార్‌ చూడాలని సూచించారు. అతిథులు, హాజరైన వారందరికీ అవసరమైన సదుపాయాలు చేపట్టాలని, అత్యవసర వైద్యసేవలు అందించేందుకు మెడికల్‌ క్యాంపు ఏర్పాటు చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా యువజన సంక్షేమాధికారికి సూచించారు. డయాస్‌, పూల డెకొరేషన్‌ ఏర్పాటు చేయాలని ఉద్యాన అధికారిని ఆదేశించారు. ఎస్పీ డీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, అడిషనల్‌ కలెక్టర్లు ఎన్‌.నటరాజ్‌, రిజ్వాన్‌ భాషాషేక్‌, ఆర్డీవో రమేశ్‌ రాథోడ్‌ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రెండు ఆలయాల్లో చోరీ

నేరడిగొండ: మండలంలోని వాగ్ధారి గ్రామంలోని జగదాంబ, సేవాలాల్ ఆలయాల్లో బుధవారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ప్రతి రోజులాగే ఆలయాల్లో పూజలు ముగించుకుని రాత్రి తాళం వేశారు. గురువారం ఉదయం 5గంటలకు గ్రామస్తులు వచ్చేసరికి తాళం పగలగొట్టి ఉంది. ఆలయంలోకి వెళ్లి చూడగా దుర్గాదేవిపై ఉన్న రెండు గ్రాముల బంగారు మంగళ సూత్రంతో పాటు హుండీలోని సుమారు రూ.2వేల నగదు ఎత్తుకెళ్లారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పర్సు అప్పగింత



పర్సును అందిస్తున్న భూమన్న

నిర్మల్‌చైన్‌గేట్: బస్సులో దొరికిన పర్సును పోలీసులకు అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి. బుధవారం హైదరాబాద్ నుంచి నిర్మల్‌కు బయలుదేరిన రాజధాని బస్సులో జిల్లా కేంద్రానికి చెందిన ఉద్గిర్ భూమన్నకు పర్సు దొరికింది. దులో రూ.9వేల నగదుతో పాటు ఏటీఎం కార్డులు ఉన్నాయి. వివరాలను పరిశీలించగా ఆర్మూర్ మండలం మామిడిపల్లికి చెందిన నదీమ్ మోహిద్దీన్‌కు చెందినట్లుగా గుర్తించాడు. పర్సును తీసుకుని నేరుగా పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు. వివరాలను పరిశీలించిన పోలీసులు నదీమ్ మోహిద్దీన్‌ను పిలిపించి పర్సు అందజేశారు. పర్సును ఇచ్చిన భూమన్నను పట్టణ పోలీసులు అభినందించారు.

సాగులో సాంకేతికతతో మేలు



డ్రోన్ సాయంతో మందు పిచికారీ

కడెం: సాగులో సాంకేతిక పరిజ్ఞానం ఎంతో మేలు చేస్తుందని ఖానాపూర్ ఏడీఏ సుజాత అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సీడ్ ఫాంలో డ్రోన్ సహాయంతో పురుగు మందు పిచికారీని పరిశీలించారు. డ్రోన్‌తో కూలీల సమస్య తీరడంతో పాటు, సమయం ఆదా అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో సంధ్యారాణి, ఏఈవోలు సురేష్, తిరుపతి ఉన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని మామిడిగూడ గ్రామపంచాయతీ పరిధిలోని చిన్న మాలేబోరిగాం గ్రామానికి చెందిన సిడాం రామ(18) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం ప్రకారం.. రామ హైదరాబాద్‌లో కూలీగా పనిచేస్తున్నాడు. ఇటీవల ఇంటికి తిరిగి వచ్చాడు. ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. ఈ విషయంపై పోలీసులను సంప్రదించగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ప్రమాదవశాత్తు కంటైనర్ బోల్తా

నేరడిగొండ: మండలంలోని లింగట్ల జాతీయ రహదారిపై కంటైనర్ గురువారం సాయంత్రం అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో అందులో ఉన్న డ్రైవర్, క్లీనర్‌లకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.

ఆటో బోల్తా..

నేరడిగొండ మండలంలోని రోల్‌మామడ జాతీయ రహదరిపై గురువారం ఆటో బోల్తాపడింది. బోథ్ మండలంలోని పిపల్‌ధరి నుంచి ఆటోలో నిర్మల్‌కి వెళ్తుండగా ప్రమాదవశాత్తు ఆటోబోల్తా ప డింది. అందులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.



మైసమ్మకు పూజలు చేస్తున్న భక్తులు



డోలాతో వస్తున్న మహిళలు



అమ్మ దర్శనానికి..

నాగోబా దర్శనానికి అమ్మ

- నేటితో ముగియనున్న జంగుబాయి ఉత్సవాలు
- మొక్కులు తీర్చుకున్న 356 మేళాలు
- నెలరోజుల పాటు కొనసాగిన జాతర
- తెలంగాణ నుంచే అధిక భక్తులు

కెరమెరి(ఆసిఫాబాద్): ఆదివాసీల ఆరాధ్యదైవంగా భావించే జంగుబాయి ఉత్సవాలు నేటితో ముగియనున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలోని కేస్లాపూర్‌లో శనివారం నుంచి ప్రారంభం కానున్న నాగోబా పూజ నేపథ్యంలో నేటి రాత్రి జంగుబాయి కేస్లాపూర్‌కు చేరుకోనుందని భక్తుల నమ్మకం. శుక్రవారం ఉత్సవాలు ముగింపు కావడంతో గురువారం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిశా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సుమారు 356 మేళంలు జంగుబాయిని దర్శించుకున్నాయి. 2లక్షలా 53 వేలకు పైగా భక్తులు హాజరైనట్లు కమిటీ సభ్యులు కొడప జాకు, మరప బాజీరావు తెలిపారు.

ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు



రావిచెట్టుకు పూజలు చేస్తూ..



నేడు దేవతల శుద్ధీకరణ

నేడు మధ్యాహ్నం 2గంటలకు సిద్దికస, దారికస, విజ్జకస, టొప్లకస ప్రాంతాల్లోని పవిత్ర నదుల్లో నుంచి గంగాజలాన్ని తీసుకొచ్చి దేవతా విగ్రహాలను శుద్ధిచేస్తారు. శనివారం కేస్లాపూర్‌లో ప్రారంభం కానున్న నాగోబా దేవతా ఉత్సవాలకు అమ్మవారు వెళ్లనుండడంతో అదే రోజు చివరిగా కటోడాలు ఖరారు చేశారు. దేవతల శుద్ధి కార్యక్రమంతో జంగుబాయి ఉత్సవాలు ముగుస్తాయి.

జువైనల్.. జస్టిస్!

- నాలుగు జిల్లాల్లో జువైనల్ కోర్టుల ప్రారంభం
- బాల నేరాల పరిష్కారం వేగవంతం
- వారానికోసారి విచారణ



మంచిర్యాల జిల్లా జువైనల్ కోర్టు ప్రారంభించిన న్యాయమూర్తి ఉపనిషధ్వని



మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జువైనల్ కోర్టు

మంచిర్యాలక్రైం: బాల నేరస్తులకు సంబంధించిన కేసుల విచారణ ఇప్పటి వరకూ ఉమ్మడి ఆదిలాబాద్‌లోనే కొనసాగుతోంది. విచారణ వేగవంతం చేయాలనే ఉద్దేశంతో ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల్లో జువైనల్ కోర్టులు ఏర్పాటు చేశారు. దీంతో ఏ జిల్లాకు సంబంధించిన కేసులను ఆయా జిల్లాలకు బదిలీ చేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల ఎదురుగా ఉన్న బాలసదన్ కార్యాలయంలో ఈ నెల 12న జువైనల్ కోర్టును ప్రారంభించారు. ఇన్‌చార్జి న్యాయమూర్తిగా జూనియర్ సివిల్ జడ్జి ఉపనిషధ్వని, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సహీనా సుల్తానా, సూపరింటెండెంట్‌గా మహ్మద్ షఫీ కొనసాగనున్నారు.

కక్షిదారులు, న్యాయవాదులకు ఊరట...

జిల్లా కేంద్రంలో జువైనల్ కోర్టు ఏర్పాటు కావడంతో ఇటు కక్షిదారులు, అటు న్యాయవాదులకు ఊరట లభించింది. ఇదివరకు జిల్లాకు చెందిన బాల నేరస్తులకు సంబంధించిన కేసులన్నీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జువైనల్ కోర్టులో న్యాయవిచారణ జరిగేవి. మంచిర్యాల నుంచి ఆదిలాబాద్‌కు వెళ్లాలంటే 150 కిలోమీటర్ల దూరం 4 నుంచి 5గంటల వరకు ప్రయాణం చేయాల్సి వచ్చేది. కొన్ని సందర్భాల్లో అక్కడే ఉండాల్సి రావడంతో అనేక ఇబ్బందులు పడ్డారు. పైగా కోర్టు టైం అయిపోయే సరికి మంచిర్యాలకు వచ్చేందుకు బస్సులు లేకపోవడంతో కక్షిదారులు బస్టాండులోనే బస చేసిన సందర్భాలున్నాయి. ఎట్టకేలకూ జిల్లా కేంద్రంలో జువైనల్ కోర్టు ఏర్పాటుతో కక్షిదారులు, న్యాయవాదులకు సమయం, డబ్బులు ఆదా కానుంది. అంతేకాకుండా కేసుల విచారణ సైతం త్వరగా పూర్తయ్యే అవకాశం ఉంది.

ఉమ్మడి జిల్లాలో బాల నేరస్తుల కేసులు

మంచిర్యాల :	70
ఆదిలాబాద్ :	74
ఆసిఫాబాద్ :	80
నిర్మల్ :	136

బాలనేరస్తుల నియంత్రణకు కృషి



బాల నేరస్తుల నియంత్రణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి. సోషల్ మీడియా, ఇంటర్‌నెట్ సెల్‌ఫోన్లు యువతను, మైనర్లను పెడదోవ పట్టిస్తున్నాయి. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టి సారించాలి. ఎవరితో మాట్లాడుతున్నారు. వారి స్నేహితుల వివరాలను సైతం తెలుసుకోవాలి. తల్లిదండ్రులు ఎక్కువ సమయం పిల్లలతో సరదాగా గడుపుతు వారితో కాలక్షేపం చేసినప్పుడు వారి మానసిక స్థితిని, వారి ప్రవర్తనలో మార్పును గమనించాలి.

– అఖిల్ మహాజన్, ఇన్‌చార్జి డీసీపీ, మంచిర్యాల

జువైనల్ కోర్టు ఏర్పాటు అభినందనీయం



జిల్లాలు ఏర్పడిన చాల కాలం తర్వాత జిల్లా జువైనల్ కోర్టు ఏర్పాటు చేయడం అభినందనీయం. దీంతో కక్షిదారులకు చాల మేలు జరుగుతోంది. సామాన్య మానవుడు ఆదిలాబాద్ వెళ్లాలంటే వారిని కొన్ని సందర్భాల్లో న్యాయవాదులే డబ్బులిచ్చి తీసుకెళ్లాల్సి వచ్చేది. ఎంతో ప్రయసాలకు ఓర్చి వెళ్లిన కొన్ని సందర్భాల్లో "కోర్టు సమయానికి వెళ్లకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వచ్చేది. తిప్పలు తప్పుతాయి.

– సహీనా సుల్తానా, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, జువైనల్ కోర్టు, మంచిర్యాల

కేసులు త్వరగా పరిష్కారం అవుతాయి



జిల్లాలో జువైనల్ కోర్టు ఏర్పాటు కావడం అభినందనీయం. దీంతో బాల నేరస్తులకు సంబంధించిన కేసులు త్వరగా పరిష్కరించబడుతాయి. జిల్లాకు మహిళా కోర్టు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. జిల్లాలో 2004 నుంచి జిల్లా కేంద్రంలో కోర్టులు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. 42 సర్వే నంబర్‌లో 5ఎకరాల స్థలం కేటాయించడం జరిగింది. త్వరగా నిర్మించాలి.

– రవీందర్‌రావ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, మంచిర్యాల

రూ.లక్ష విలువైన గంజాయి పట్టివేత

- వివరాలు వెల్లడించిన సీఐ రఘుపతి



వివరాలను వెల్లడిస్తున్న సీఐ రఘుపతి

ఆదిలాబాద్‌రూరల్: మహారాష్ట్రలో గంజాయి విక్రయించేందుకు వెళ్తుండగా మావల, సీసీఎస్ పోలీసులు బుధవారం ఉమ్మడిగా దాడి చేసి దస్నాపూర్ సమీపంలో రూ.లక్ష విలువ చేసే గంజాయిని పట్టుకున్నారు. గురువారం మావల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆదిలాబాద్ రూరల్ సీఐ రఘుపతి వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లాలోని నార్నూర్ మండలానికి చెందిన దుతిరాజ్ ప్రశాంత్ జల్సాలకు అలవాటుపడ్డాడు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాధించాలనే ఉద్దేశంతో గంజాయి సరఫరా చేయాలని నిర్ణయించుకున్నారు. తన మిత్రులతో కలిసి ఆంధ్రా, ఒరిస్సా సరిహద్దుల్లో గంజాయి తక్కువ ధరకు కొనుగోలు చేసి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌కు సరఫరా చేస్తున్నాడు. తనకు వరుసకు మామైనా మిలింద్ నిర్వతికి గంజాయి సరఫరాపై చెప్పాడు. ఈ నెల 14న ఇరువురు హైదరాబాద్ చేరుకొని ప్రశాంత్ తనకు ముందే పరిచయం ఉన్నా లక్ష్మణ్‌కు ఫోన్ చేశాడు. గంజాయి కావాలని తెలిపి ఇద్దరు కలిసి ఈలనె 15న భద్రాచలం చేరుకొని రాత్రి అక్కడే ఉన్నారు. లక్ష్మణ్ వీరిని సిలేరు దగ్గరకు రమ్మని చెప్పగా వారు మరుసాటి రోజు 16వ తేదీన సిలేరుకు వెళ్లారు. అతడు వీరికి గంజాయి నమూనాలు చూయించాడు. అది చూసిన ప్రశాంత్ రూ.10వేలు అడ్వాన్స్‌గా ఇచ్చి కిలోకు రూ.3వేల చొప్పున ఎనిమిది కిలోల గంజాయి కావాలని అడిగాడు. ఈ నెల 17న భద్రాచలం చేరుకుని లక్ష్మణ్ ప్రశాంత్‌కు ఫోన్ చేసి బస్టాండ్‌కు వెళ్లాలని, అక్కడ మాకు సంబంధించిన వ్యక్తి గంజాయి ప్యాకెట్లు ఇస్తాడని చెప్పారు. ప్రశాంత్, మిలింద్ ఇద్దరు బస్టాండుకు వెళ్లగా ఓ వ్యక్తి వచ్చి 8 కిలోల నాలుగు గంజాయి ప్యాకెట్లు ఇచ్చారు. దీంతో ప్రశాంత్ ఫోన్‌పే ద్వారా రూ.13వేలు పంపించాడు. 18వ తేదీన ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్రకు వెళ్లేందుకు దస్నాపూర్ సమీపంలో ఆటో కోసం వేచి ఉండగా పోలీసులు పట్టుకుని తనిఖీ చేసి గంజాయి, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నాం. ఈ సమావేశంలో ఎస్సై విష్ణు వర్ధన్ ఉన్నారు.

గొంతునులిమి భార్యను హతమార్చిన భర్త

- నిందితుడి కోసం గాలింపు చర్యలు



సురేఖ మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ

భైంసారూరల్: కట్టుకున్నవాడే కాలయముడయ్యాడు. జీవితాంతం తోడుగా ఉండాల్సిన వాడే గొంతునులిమి హతమార్చాడు. ఈ సంఘటన భైంసా మండలం దేగాం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మహారాష్ట్రలోని ధర్మాబాద్ తాలుకా బాలాపూర్ గ్రామానికి చెందిన జలోజీ కూతురు సురేఖ అలియాస్ జ్యోతి(28) పదేళ్ల క్రితం భైంసా మండలం దేగాం గ్రామానికి చెందిన రమేశ్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఎనిమిదేళ్ల కుమారుడు, నాలుగేళ్ల కూతురు ఉంది. రమేశ్ ఏ పని చేయకుండా మద్యం తాగుతూ జులాయిగా తిరిగేవాడు. రోజు మద్యం తాగివచ్చి భార్యను వేధించేవాడు. సురేఖ బీడీ కంపెనీలో ప్యాకింగ్ కార్మికురాలిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. గురువారం భార్యతో గొడవపడిన రమేశ్ గొంతునులుమి హత్య చేశాడు. అనంతరం ఇంటికి తాళం వేసే క్రమంలో అనుమానం వచ్చిన చుట్టుపక్కల వారు ప్రశ్నించారు. అంతలోపే అక్కడి నుంచి పారిపోయాడు. స్థానికులు లోపలికి వెళ్లి చూడగా సురేఖ మృతి చెంది కనిపించింది. మృతదేహాన్ని భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతురాలి పిల్లలు రోదించిన తీరు స్థానికులను కంటతడి పెట్టించింది. తండ్రి జలోజి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



అదనపు గదులకు భూమిపూజ చేస్తున్న మంత్రి

లక్ష్మణచాంద(నిర్మల్): ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకే సీఎం కేసీఆర్ మన ఊరు–మన బడి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. గురువారం నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మన ఊరు–మన బడి పథకంలో భాగంగా మంజూరైన రూ.89 లక్షల నిధులతో చేపట్టనున్న పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాఠశాలలో అదనపు గదులు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, నీటి వసతి, బెంచీలువంటి 12 రకాల మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు బాగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో సుధీర్ కుమార్, డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, ఎంపీపీ అడ్వాల పద్మ, జెడ్పీటీసీ రాజేశ్వర్, సర్పంచ్ ముత్యంరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు మోహన్, నాయకులు రమేశ్, క్రిష్ణారెడ్డి, గణేశ్, ఈటెల శ్రీనివాస్, జహీరొద్దీన్, మల్లయ్య, బిట్లింగ్ నారాయణ పాల్గొన్నారు.

నాగోబా ఆలయంలో పూజలు



కార్యదర్శికి చిత్రపటం అందిస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ డెప్యూటీ కార్యదర్శి శుక్‌లాల్ మీనాలు నాగోబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మెస్రం వంశీయులు శాలువలతో సన్మానించారు. నాగోబా ఆలయ చరిత్ర, జాతర నిర్వహన వివరాలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఇందులో మెస్రం నాగ్‌నాథ్, మెస్రం శేఖ్‌నాథ్ ఉన్నారు.

వెంటాడుతున్న నీటి సమస్య



బిందెలతో నీళ్లు తెచ్చుకుంటున్న మహిళలు

ఇంద్రవెల్లి: మర్రిచెట్టు వద్ద బస చేసిన మెస్రం వంశీయులకు నీటి కష్టాలు తప్పడం లేదు. కలెక్టర్, ఐటీడీఏ పీవో ఆదేశాలను అధికారులు విస్మరిస్తున్నా రు. గురువారం ఉదయం ట్యాంక్ నింపకపోవడంతో నీటి సమస్య ఏర్పడింది. ఎడ్లకు ప్రత్యేక నీటి సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంతో వాటి దాహం తీర్చడానికి మెస్రం వంశీయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నాగోబా మహాపూజకు వచ్చిన మెస్రం వంశీయులకు ఇటు మర్రి చెట్టు వద్ద, అటు గోవడ్ వద్ద నీటి సమస్య రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మెస్రం వంశ పెద్దలు కోరుతున్నారు.

ప్రభుత్వాలు మొండి వైఖరి వీడాలి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్

ఎదులాపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పట్ల మొండి వైఖరి వీడాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ ప్రధాన కార్యాలయంలో గురువారం నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు తీర్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈ నెల 27నుంచి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవర్ధన్, సిర్ర దేవేందర్, ఉప ప్రధాన కార్యదర్శి రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ నాందేవ్, నాయకులు గంగయ్య, ఖాసీం, సాంబన్న, ఆశన్న, సురేశ్, ఉస్మాన్, మారుతి, చందు, పాల్గొన్నారు.

ఒకే ఈతలో రెండు లేగదూడలు



రెండు లేగదూడలకు జన్మనిచ్చిన ఆవు

తాంసి: భీంపూర్ మండలంలోని నిపాని గ్రామానికి చెందిన నల్ల ధనుంజయ్‌కి చెందిన ఆవు ఒకే ఈతలో రెండు లేగ దూడలకు గురువారం జన్మనిచ్చింది. సదరు రైతు వద్ద ఈ ఆవు 13సంవత్సరాలుగా వరుసగా ఒక ఈతలో ఒక దూడకు మాత్రమే జన్మనిచ్చేది. 14వ ఈతలో రెండు లేగదూడలు జన్మించడంతో గ్రామస్తులు వాటిని చూసేందుకు ఆసక్తి కనబర్చుతున్నారు.

బాసర ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

భైంసా: బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ హుండీని గురువారం లెక్కించారు. 51 రోజుల హుండీలో రూ.53,24,420 నగదు, 102 గ్రాముల మిశ్రమ బంగారం, 4.060 కిలోల వెండి, 18 విదేశీ కరెన్సీ వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన, స్టేట్‌బ్యాంక్ సిబ్బంది, ఎస్సై, వాగ్దేవి సొసైటీ సభ్యులు ఉన్నారు.

క్లుప్తంగా

కంటివెలుగు కేంద్రాల సందర్శన



పరిశీలిస్తున్న జోగు ప్రేమేందర్

ఆదిలాబాద్‌టౌన్: కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని సుభాష్‌నగర్, జై జవాన్‌నగర్‌లో నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడాలేని పథకాలను సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, మున్సిపల్ కమిషనర్ శైలజ, ఎస్సై నరేందర్, వార్డ్ కౌన్సిలర్ లక్ష్మణ్, వెంకన్న, ధమ్మాపాల్, మీషు, గోలి శంకర్ పాల్గొన్నారు.

తపాలా బీమా సద్వినియోగం చేసుకోవాలి



బీమా పత్రం అందిస్తున్న సుహాసినీరెడ్డి

జైనథ్: కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో తపాలా శాఖ అందిస్తున్న బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకులు చిట్యాల సుహాసినీ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వాహన డ్రైవర్లకు, బీజేపీ కార్యకర్తలకు ఉచితంగా ప్రమాద బీమా చేయించారు. ఆమె మాట్లాడుతూ.. కేవలం రూ. 400లు చెల్లించడంతో రూ. 10లక్షల వరకు ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేష్ రెడ్డి, ప్రతాప్ యాదవ్, సత్యనారాయణ, సంతోష్, చిల్క చిన్నన్న, శాలిక్ రావ్, అశోక్ రెడ్డి, అశీష్ రెడ్డి, లక్కం రమేష్, అన్నెల అశోక్, పోస్టల్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అందరికీ న్యాయ సలహాలు



మాట్లాడుతున్న క్షమాదేశ్ పాండే

తాంసి: ప్రజలందరికీ న్యాయ సలహాలు అందిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన కార్యదర్శి క్షమాదేశ్‌పాండే అన్నారు. గురువారం భీంపూర్ మండల కేంద్రంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులకు, ప్రజలకు బ్యాంకు రుణాల చెల్లింపులు, పెండింగ్ రుణాలపై అవగాహన కల్పించారు. సత్వర న్యాయం కోసం ప్రతిఒక్కరూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని కోరారు. న్యాయ సేవాధికార సంస్థ తరఫున ఉచితంగా న్యాయ సహాయం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో భీంపూర్ జెడ్పీటీసీ సుధాకర్, సర్పంచ్ లింబాజీ, నాబార్డ్ డీడీఎం రవూఫ్, లీడ్ బ్యాంకు మేనేజర్ ప్రసాద్, తహసీల్దార్ మహేంద్రనాథ్, ఏడీఏ రమేష్, న్యాయవాది వెండి బద్రీశ్వర్, ఏవో రవీందర్ పాల్గొన్నారు.

కర్ణాటకకు మాతంగ్ రుషి సభ్యులు



కర్ణాటకకు బయలుదేరుతున్న సంస్కార కేంద్రం సభ్యులు

నార్నూర్: మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో మాతంగ్ రుషి సంస్కార కేంద్రం నిర్మాణం కోసం పవిత్ర జలం, మట్టిని తీసుకురావడానికి గురువారం ఆ కేంద్రం సభ్యులు కర్ణాటకలోని హంపి పుణ్యక్షేత్రానికి బయలుదేరారు. ఈ సందర్భంగా సంస్కార కేంద్రం వ్యవస్థాపకుడు సూర్యవంశీ పండరి మాట్లాడారు. సమాజంలో ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించడానికి ఈ కేంద్రాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, కేంద్రం అధ్యక్షుడు సాగురే పాండు, గౌరవ అధ్యక్షుడు నర్సింగ్ మోరే, సభ్యులు అరవింద్ కలవలే, వామన వాగ్మారే, మెటే సదాశివ్ ఘాట్ రామారావు ఉన్నారు.

ఆలయంలో సందడి

కుంటాల : రెండో షిరిడీగా పేరుగాంచిన మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. వివిధ గ్రామాల మహిళలు ఆలయానికి తరలివచ్చి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

అంధత్వ నివారణకు కృషి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న
- పలు గ్రామాల్లో 'కంటివెలుగు' ప్రారంభం



నేరడిగొండ: ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ అనిల్‌జాదవ్



ఆదిలాబాద్‌రూరల్: రిబ్బన్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే



బేల: ప్రారంభిస్తున్న రావుత్ మనోహర్

ఆదిలాబాద్‌రూరల్: అంధత్వ నివారణకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. గురువారం మండలంలోని అంకోలిలో కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయలక్ష్మి రాజు, ఎంపీపీ గండ్రత్ రమేష్, పరమేశ్వర్, జిట్ట రమేష్ పాల్గొన్నారు.

తాంసి: కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ తాటిపెల్లి రాజు అన్నారు. గురువారం మండల కేంద్రంలో వైద్యాధికారి శ్రావ్యతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ మంజుల, ఎంపీడీవో భూమయ్య, మండల ప్రత్యేకాధికారి కిరణ్ కుమార్, సర్పంచ్ కృష్ణ, ఎంపీవో సుధీర్ రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. భీంపూర్ మండలంలోని కరంజి(టి) గ్రామంలో జెడ్పీటీసీ సుధాకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యాధికారి నిఖిల్‌రాజ్, మండల ప్రత్యేకాధికారి గోపికిషన్, సర్పంచ్ నరేందర్, సూపర్‌వైజర్ గంగాధర్, హెచ్‌ఈవో జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

బోథ్: ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో కంటివెలుగు కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోడు అందిస్తామన్నారు. పొచ్చరలో ఎంపీపీ తుల శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సంధ్యారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్మణ్ సింగ్, వైస్ చైర్మన్ సంజీవ్ రెడ్డి, వైస్ ఎంపీపీ లింబాజీ, సర్పంచ్ సురేందర్, బిన్ సలాం, నారాయణ రెడ్డి, ఎలుక రాజు, సుభాష్, రమణ గౌడ్, జగన్ రెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలో కంటివెలుగు కార్యక్రమాన్ని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి ప్రారంభించారు. ప్రజలకు అవగాహన కల్పించారు. స్వచ్ఛందంగా వచ్చి కంటి పరీక్షలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పోటే శోభాబాయి, జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, మహ్మద్ అంజద్, ఎంపీడీవో పుష్పలత పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ మల్లేపూల నర్సయ్య కోరారు. గురువారం మండల కేంద్రంలో కంటివెలుగును ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చౌహన్ రాధ, వైస్ ఎంపీపీ పోరెడ్డి శ్రీనివాస్, ఎంపీవో మహేందర్‌రెడ్డి, సర్పంచ్ పరచ లావణ్య, మెడికల్ ఆఫీసర్లు శిల్ప, భీంరావు, అలేఖ్య, ఏపీవో గణేష్, ప్రకాష్, దేవిదాస్, రమేష్, హేమలత పాల్గొన్నారు.

తలమడుగు: మండలంలోని ఖోడద్, ఉండమ్ గ్రామంలో గురువారం కంటి వెలుగును జిల్లా డీఆర్‌డీవో పీడీ కిషన్, జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో రమాకాంత్, వైద్యాధికారి రిస్, శ్రీకాంత్, సర్పంచ్‌లు ఆనంద్, పోచ్చుబాయి, కిరణ్ కుమార్, వెంకటేష్, నర్సింహులు పాల్గొన్నారు,

నేరడిగొండ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ అనిల్ జాదవ్ కోరారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రవిశంకర్, ఎంపీపీ రాథోడ్ సజన్, ఎంపీడీవో అబ్దుల్ సమద్, సర్పంచ్ పెంట వెంకటరమణ, మండల ఉపాధ్యక్షుడు ఏలేటి మహేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, ఎంపీవో శోభన, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల, వైద్యాధికారి ఎండీ సద్దాం పాల్గొన్నారు.

నార్నూర్: గాదిగూడ మండల కేంద్రంలో గురువారం ఎంపీపీ అడ చంద్రకళ రాజు, నార్నూర్ మండల కేంద్రంలో ఎంపీపీ కనక మోతుబాయిలు కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆధార్‌కార్డు తప్పని సరిగా తీసుకువచ్చి కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆయా కార్యక్రమంలో సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్, ఎంపీటీసీ పరమేశ్వర్, పీఏసీఎస్ చైర్మన్ అడే సురేశ్, హెచ్‌ఈ నాందేవ్, సంజీవ్, హెచ్‌ఈ రవీందర్ పాల్గొన్నారు.

బేల: మండలంలోని సిర్సన్న రైతువేదికలో గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి శంకర్, ఎంపీపీ తాక్రే వనిత గంభీర్, ఎంపీడీవో రవీందర్, వైద్యాధికారి వంశీకృష్ణ, తన్వీర్‌ఖాన్, సతీష్‌పవార్, దీపక్‌గౌడ్, గోడం సునీల్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

జైనథ్: ప్రభుత్వం గ్రామాల వారీగా కంటివెలుగు నిర్వహిస్తుందని ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో కంటివెలుగు కార్యక్రమానికి ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో శ్రీకాంత్, మండల ప్రత్యేకాధికారి పుల్లయ్య, ఎంపీడీవో గజానన్ రావ్, తహసీల్దార్ రాఘవేంద్ర రావు, మెడికల్ ఆఫీసర్లు నైనత, ప్రియదర్శిని, తుమ్మల వెంకట్ రెడ్డి, సర్పన్ లింగారెడ్డి, సర్పంచ్ దుమాల దేవన్న పాల్గొన్నారు.



తలమడుగు: ప్రారంభిస్తున్న అధికారులు



ఇంద్రవెల్లి: పరిశీలిస్తున్న కుమ్ర ఈశ్వరీబాయి



తాంసిలో..



నార్నూర్: గాదిగూడలో ప్రారంభిస్తున్న ఎంపీపీ

రక్తదానం చేసేందుకు ముందుకు రావాలి

ఆదిలాబాద్‌టౌన్: స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని రిమ్స్ బ్లడ్‌బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ రాజ్యలక్ష్మి అన్నారు. గురువారం శ్రీరామ్ సేన ఆధ్వర్యంలో 40 మంది సభ్యులు రిమ్స్ బ్లడ్‌బ్యాంక్‌లో రక్తదానం చేశారు. ఆమె మాట్లాడుతూ.. రక్తదానంపై అపోహలను వీడి, రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో రిమ్స్ బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది సతీష్ రెడ్డి, సూర్యనారాయణ, సులేమాన్, బిపాషా, అనిల్, ప్రమోద్, శశికాంత్ పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక



సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల కార్యవర్గాన్ని గురువారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో సంఘ భవనంలో ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా సర్వేందర్, ఉపాధ్యక్షుడిగా పోశెట్టి, కార్యదర్శిగా అబ్దుల్ గఫ్ఫార్, సంయుక్త కార్యదర్శిగా జి.రాజేష్, కోశాధికారిగా నారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శిగా రాజు, ప్రచార కార్యదర్శిగా జి.శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులుగా వెంకటేశ్వర్, రాజన్న, పద్మ, మంజుల రాణి, అబ్దుల్ వహీద్‌లను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా టీఎన్‌జీవో ప్రధాన కార్యదర్శి నవీన్ వ్యవహరించారు. అనంతరం కార్యవర్గ సభ్యులను సన్మానించారు.

క్రీడాకారిణికి సన్మానం

ఆదిలాబాద్: జిల్లాకు చెందిన వుషూ క్రీడాకారిణి అనిత రాథోడ్ సీనియర్ సౌత్ జోన్‌స్థాయి పోటీల్లో మూడో స్థానంలో నిలిచింది. గురువారం జిల్లా కేంద్రంలో ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సన్మానించారు. ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి శాలువతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో కోచ్ వీరేష్, అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రజాగోస.. బీజేపీ భరోసా



ప్రజలతో మాట్లాడుతున్న రాథోడ్ రమేశ్

సిరికొండ: మండలంలోని పలు గ్రామాల్లో ప్రజాగోస.. బీజేపీ భరోసా కార్యక్రమం కొనసాగుతోంది. గురువారం మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్ ఆధ్వర్యంలో వాయిపేట్ నుంచి ఫకీర్‌నాయక్ తాండా, భీంపూర్, రాంనగర్, చింతగూడ, చిమ్మన్‌గూడి, సూర్యపేట్, బోరింగ్ గూడ గ్రామాల్లో కొనసాగింది. గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ.. బీజేపీ అధికారంలోకి వస్తే కలిగే లాభాలను ప్రజలకు వివరించారు. దోపిడీ పాలనతో ప్రజలు విసుగు చెందారని, బీఆర్ఎస్ నాయకులు ఎలాంటి అభివృద్ధి చేయకుండా కాలం వెళ్లదిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు అమోల్, ఎంపీపీ పెందుర్ అమృత్‌రావు, రఘురాం, మారుతి, గిరిజన మోర్చా అధ్యక్షుడు మర్సరాజు, శకావత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తులకు అన్ని వసతులు కల్పిస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న

బేల: బైరందేవ్, మహాదేవ్ పురాతన ఆలయాల అభివృద్ధిపై చర్చించి, భక్తులకు అన్ని వసతులు కల్పిస్తామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. గురువారం మండలంలోని సదల్‌పూర్ బైరందేవ్, మహాదేవ్ ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆదివాసీ దర్బార్‌లో మాట్లాడుతూ.. శిథిలావస్థకు చేరిన ఆలయాల సమస్యలను పురావస్తు శాఖ దృష్టికి తీసుకెళ్తాన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్, జిల్లా డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, లింగారెడ్డి, తాక్రే గంభీర్, సతీష్ పవార్, వేణుగోపాల్ యాదవ్, ప్రమోద్‌రెడ్డి, కొడపే అరుణ్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆడపిల్లలకు ఉన్నత చదువులు చెప్పించాలి

సారంగపూర్: ఆడపిల్లలకు ఉన్నత చదువులు చెప్పించాలని ఇన్‌చార్జి సీడీపీఓ విజయగౌరి అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం నేపథ్యంలో గురువారం మండలకేంద్రంలోని పంచాయతీ కార్యాలయ సమీపంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జి సీడీపీఓ.. ఐకేపీ మహిళలకు, ఆడపిల్లల చట్టాలు, హక్కులు, బేటీ బచావో- బేటీ పడావోపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సరోజ, సర్పంచ్ సుజాత, ఎంపీటీసీ సామల పద్మ, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.

నర్సాపూర్(జీ): ఈనెల 24న జాతీయ బాలికల దినోత్సవం నేపథ్యంలో మండల కేంద్రంలోని ఉర్దూ ఉన్నత పాఠశాల విద్యార్థినులు, వారి తల్లులకు గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ రాంరెడ్డి, ఎంపీటీసీ మల్లేశ్, రజనిదేవి పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్ ప్రమాదకరంగా రోడ్డు..



ఇచ్చోడ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఇటీవల వంతెన కూలిపోయింది. దీంతో తాత్కాలికంగా పైపులు వేసి రోడ్డును పునరుద్ధరించారు. కానీ పైపులపై మట్టి తొలగిపోయి ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

- సంబంధిత అధికారి: ఆర్‌అండ్‌బీ డీఈ, సునీల్, ఫోన్: 84649 60600

ప్రమాద బీమా చెక్కు అందజేత

ఆదిలాబాద్‌టౌన్: గతేడాది లాండసాంగ్వి గ్రామానికి చెందిన ఉద్ధవ్ పిండి గిర్నీలో పడి మృతి చెందగా, ఆయన కుటుంబ సభ్యులకు ఎంపీపీ గండ్రత్ రమేష్ బీఆర్ఎస్ తరఫున ప్రమాద బీమా చెక్కు అందజేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో పార్టీ నుంచి మంజూరైన రూ.2లక్షల చెక్కును బాధితురాలి కూతురు శిల్పకు అందించారు. కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ జిట్ట రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పరమేశ్వర్, సర్పంచ్ సువర్ణ, శ్రీనివాస్, సేవ్వా జగదీష్, కనక రమణ మోతిరాం, బుచ్చన్న పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే బాపురావ్

బజార్‌హత్నూర్: యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ యువజన సంఘం మండల అధ్యక్షుడు దుబ్బుల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతరాష్ట్ర కబడ్డీ పోటీల్లో పాల్గొన్నారు. ఫైనల్‌లో విజేత బజార్‌హత్నూర్ కబడ్డీ జట్టుకు రూ.30వేల నగదు బహుమతి, రన్నర్ అఫ్ దేడ్ర జట్టుకు రూ.15వేలు అందజేశారు. యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండి తల్లితండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో అటవీశాఖ కార్యాలయం భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో బోథ్ సీఐ కిరణ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్మాన్‌సింగ్, మోట్టే కిరణ్, కానిందే రాజారాం, సర్పంచులు పరచ లావణ్య, సాయన్న, విద్యాసాగరా, అడ్వకేట్ విశ్వజీత్, సుర్యప్రకాష్ పాల్గొన్నారు.

'సోషల్' సేవ

- శ్రీరాంసేనా సొసైటీ పేరుతో వాట్సాప్ గ్రూప్
- 7వేలకు పైగా యూనిట్ల రక్తదానం



రక్తదానం చేస్తున్న సభ్యులు

గుడిహత్నూర్: మండల కేంద్రానికి చెందిన లోఖండే అనిల్ గతంలో వాళ్ల నాన్నకు అత్యవసరంలో రక్తం అవసరం కాగా ఎంత ప్రయత్నించినా.. రక్తం దొరకని స్థితిలో తీవ్ర వేదనను ఎదుర్కొన్నాడు. ఆ గండం నుంచి గట్టెక్కిన తర్వాత తాను పడ్డ వేదన మరొకరు పడొద్దనే ఉద్దేశంతో 2008లో ఏడుగురు మిత్రులతో కలిసి శ్రీరాం సేనా అనే పేరుతో వాట్సాప్ గ్రూప్ స్థాపించాడు. నెల వ్యవధిలోనే రక్త గ్రహీతల నుంచి సంప్రదింపులు ప్రారంభం కావడంతో తన మిత్రుల సహకారంతో రోగికి సకాలంలో రక్తం అందేలా కృషి చేశాడు. రక్తదానం ప్రాముఖ్యత రక్తదాతల్లో ఉన్న అపోహలను తొలగించి ముందుకు సాగాడు. దీంతో ప్రస్తుతం ఈ గ్రూపులో ఉన్న 240 సభ్యులందరూ రక్తదాతలుగా ఉన్నారు. ఇప్పటి వరకు 7వేల యూనిట్లకు పైగా రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలుస్తున్నారు. జిల్లాలోనే కాకుండా మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్‌తో పాటు ఇతర నగరాల్లో చికిత్స పొందుతున్న రోగులకు రక్తం అవసరమైన సమయంలో అక్కడి రక్తదాతలను సంప్రదించి సకాలంలో రక్తం అందేలా చూస్తున్నారు.

ప్రశంసల వెల్లువ

వీరు చేస్తున్న సేవలను ప్రభుత్వం, ప్రభుత్వేతర సంస్థలు గుర్తించి అనేక సార్లు ప్రశంసా పత్రాలు, పురస్కారాలు అందించాయి. ఏటా స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ ద్వారా ఉత్తమ సామాజిక సేవా పురస్కారాలు పొందుతున్నారంటే రక్తదానం సేవల్లో వీరి అంకితభావం అర్థమవుతుంది. గత జూన్ 14న హైదరాబాద్‌లోని గాంధీ మెడికల్ కళాశాలలో నిర్వహించిన ప్రపంచ రక్తదాతల దినోత్సవంలో ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావ్ చేతుల మీదుగా ఉత్తమ రక్తదాతల ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. 2019 అక్టోబరులో హైదరాబాద్‌లో జరిగిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర స్థాయి సభకు హాజరు కాలేక గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పంపిన ఉత్తమ రక్తదాన అవగాహన కర్తగా ప్రశంసా పత్రాన్ని గత జిల్లా కలెక్టర్ దివ్యాదేవరాజన్ చేతుల మీదుగా అందుకొని రక్తదాన సేవలకు నిర్వచనంలా నిలుస్తున్నారు.

ఆపదలో అండగా..



ఆపదలో ఉన్న వారికి అండగా ఉండాలనే తపనతో ఈ గ్రూపు ద్వారా సాధ్యమైనంత వరకు రక్తదానం చేస్తున్నాం. నా జన్మదినాన్ని పురస్కరించుకొని సైతం మిత్రులు ముందుకు వచ్చి రక్తదానం చేసి నా ధైర్యాన్ని మూడింతలు చేశారు.

– పెద్దివార్ శశికాంత్, శ్రీరాం సేనా ఉపాధ్యక్షుడు

రక్తదానం చేయాలి



ప్రతిఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలి. బాధితుల కుటుంబ సభ్యులు సైతం రక్తదానం చేయడానికి వెనుకాడుతున్నారు. ఇది కరెక్టు కాదు. మీరిచ్చే రక్తంలోని ప్రతి బొట్టును సరైన సమయంలో వినియోగిస్తారు.

– లోఖండే అనిల్, శ్రీరాంసేనా అధ్యక్షుడు, గుడిహత్నూర్

ఉద్యమాలతో సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న జక్కుల నారాయణ

ఇచ్చోడ: ఉద్యమాలతో దివ్యాంగుల సమస్యలు పరిష్కరం అవుతాయని దివ్యాంగులు సంఘం జిల్లా అధ్యక్షుడు జక్కుల నారాయణ అన్నారు. గురువారం మండల కేంద్రలో బోథ్ నియోజకవర్గం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం దివ్యాంగులను గుర్తించి డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నిరుపేద దివ్యాంగుకు అంత్యోదయ కార్డులు అందచేసి 35 కిలోల బియ్యం పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో నిర్మల్ జిల్లా అధ్యక్షుడు ఇసాక్, నవాజ్‌ఖాన్, దివ్యాంగులు పాల్గొన్నారు.